# చట్టాలపై అవగాహన ఉండాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** యువత, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జైనూర్ సీఐ ఎర్రబెల్లి రమేశ్ అన్నారు. విద్యార్థులు, యువతలో చట్టపరమైన అవగాహన పెంపొందించుటకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జైనూర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు. పోలీస్ కళా బృందం రోహిత్ నాయకత్వంలో పాటల రూపంలో అవగాహన కల్పించారు. షీటీమ్ ద్వారా మహిళల రక్షణ, సైబర్ నేరాల నివారణ, చైల్డ్ చట్టాలపై అవగాహన, విద్యార్థుల భవిష్యత్తు దిశగా కెరీర్ గైడెన్స్ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. అలాగే నూతన సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్సై జి రవి కుమార్ చట్టాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండి కెరీర్ లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన పనుల జాతర



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పనుల జాతర కార్యక్రమం శుక్రవారం బెజ్జూర్ మండల వ్యాప్తంగా ప్రారంభించినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 41 పనులకు రూ.7.92 లక్షల అంచనా విలువతో పనులు మంజూరు చేసి ప్రారంభించినట్లుగా పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా పేదరిక నిర్మూలనతో పాటు వలస కూలీ నిర్మూలన జరుగుతుందన్నారు. ఉపాధిహామీలో రైతులు, కూలీలకు మేలు జరిగే అనేక కార్యక్రమాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పశువుల పాకలు, కోళ్ల పాకలు, మంచినీటి బావులు, రొయ్యల చెరువులు వంటి పాడి పరిశ్రమలతో పాటు నీటి కాల్వలు, ఇంకుడుగుంతలు, సామూహిక మరుగుదొడ్లు వంటి పనులు ఉపాధిహామీలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో పశువుల పాకలకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామాల్లో వంద రోజుల పని పూర్తి చేసిన ఉపాధి కూలీలను సన్మానించినట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ రాజయ్య, మండల పంచాయతీ అధికారి గౌరీశంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ ఈసీ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని వివిధ గ్రామాల్లో మంజూరైన పనుల జాతర భూమి పూజల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాండూర్ మండలం 3 ఇంక్లైన్ గ్రామపంచాయతీ ఆవరణలో మంజూరైన గ్రామపంచాయతీ నూతన భవన సముదాయానికి తాండూర్ ఎంపీడీవో పి శ్రీనివాస్, ఎంపీఓ జి అనిల్ కుమార్ మండల నాయకుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ గ్రామ పంచాయితీ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనానికి ప్రతిపాదనలు పంపగా. ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి గాను రూ.20 లక్షల నిధులు కేటాయించిందన్నారు. అలాగే తాండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, నాయకుల ఆధ్వర్యంలో భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో నందకుమార్, పీఆర్ ఏఈ సాయిలత, పంచాయితీ కార్యదర్శి తోఫిక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యస్ మహేందర్ రావు, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్ రవీందర్ రెడ్డి, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా, తాండూర్ సింగల్ విండో ఉపాధ్యక్షులు కే రత్నాకర్ రావు, మాజీ ఎంపీపీ ఎస్ శంకర్, మాజీ తాండూర్ సింగల్ విండో అధ్యక్షులు సూరం దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం రాజేశం, పుట్ట శ్రీనివాస్, షేక్ మోమిన్ అలీ, గొర్లపల్లి బాణేష్, అంజి, సింగారావ్ శ్రీధర్, ఇందూరి గట్టయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కు సన్మానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి ఉత్తమ పురస్కార్ అవార్డు పొందిన జైనూర్ మండల తహశీల్దార్ ఆడ బీర్షావ్ ను శుక్రవారం సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ (సిడబ్ల్యూఎస్) సంస్థ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తహశీల్దార్ కు ఉత్తమ పురస్కార్ అవార్డు రావడం ఎంతో సంతోషమని పేర్కొన్నారు. పదవి కాలంలో ఇంకా పదోన్నతులు ఉత్తమ సేవలందించి మరిన్ని ఉత్తమ అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి సంస్థ జైనూర్ మండల ఎఫ్ఈడబ్ల్యూ హేన్వతే దిగాంబర్, నార్నూర్ మండల ఎఫ్ఈడబ్ల్యూ జివ్నె కైలాస్, దుర్వా నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలి






## ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎంవీ రమేష్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** రక్తదానం చేయడం ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే,, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, జిల్లా వైద్యాధికారి సీతారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి మాట్లాడుతూ రక్తదానం మనిషి మాత్రమే చేయగలడన్నారు. ఒకరు చేసిన రక్తదానం ముగ్గురికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రపంచంలో ప్రతి 3 నిమిషాలకు ఒకరికి రక్తం అవసరం పడుతుందన్నారు. దీన్ని ఉద్దేశించి వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఎవరికివారుగా సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తే బాధితులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరు రక్తం ఇవ్వడానికి అర్హులేనని తెలిపారు. బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా లక్ష యూనిట్లు రక్త సేకరణకు నడుము కట్టడం గొప్ప విషయం అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి యువరాజ మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయం అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. దీనికోసం పేద ప్రజలు నేరుగా లీగల్ సర్వీస్ సెంటర్ ను సంప్రదించవచ్చున్నారు. ప్రభుత్వం నూతనంగా మధ్యవర్తిత్వ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, దేశ వ్యాప్తంగా 90 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలోని కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సీతారాం మాట్లాడుతూ జిల్లాలో కాగజ్ నగర్, ఆసిఫాబాద్ లలో రెండు బ్లడ్ బ్యాంక్ కేంద్రాలు ఉన్నాయని, జైనూర్ లో మరొకటి ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో ఉచితంగా రక్తం అందిస్తున్నట్లు, 8 గ్రాముల కంటే తక్కువగా ఉన్నవారికి ఆసుపత్రిలో రక్తం ఎక్కిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి మూడు నెలలకోసారి ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అవుతాయని, సంవత్సరంలో మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. తీవ్రమైన వ్యాధులు ఉన్నవారు మినహా ఎవరైనా రక్తదానం చేయవచ్చని సూచించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. అంతకుముందు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, వైద్య సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గూడెల అభివృద్ధికి నిధులు కేటాయించాలి




**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలోని ఆదివాసి గుడేలా అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయింకాలనీ సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాంలు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకులు, ఆదివాసీలతో కలిసి తాండూర్ మండలం నర్సాపూర్ పరిది లచ్చుపటేల్ గూడెంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టును, తెగిపోయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వర్టు పైపులు కొట్టుకుపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతియేటా ఇదే పరిస్థితి ఎదురవుతుందని, అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం రాలేదన్నారు. కొట్టుకుపోయిన కల్వర్టు విషయంపై సంబంధిత శాఖ అధికారులకు ఆదివాసీలు వినతి పత్రాలు అందజేసినా స్పందించడం లేదని తెలిపారు. అధికారులు సకాలంలో స్పందించకపోతే బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం కోసం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు ఆదివాసీలతో కలిసి పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. అనంతరం సీపీఎం పార్టీ నాయకులు తాండూర్ తహశీల్దార్ కార్యాలయం ముందు ఆదివాసీలు కల్వర్టు పనులు, రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని చేపడుతున్నరిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆదివాసి గుడాల్లో సత్వరమే అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఎంపీడీవో శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తాండూర్ మండల కార్యదర్శి బొల్లం రాజేశం, మండల కమిటీ నాయకులు రాజయ్య, తుడుందెబ్బ తాండూర్ మండల అధ్యక్షులు కురిసింగ బాపూరావు, ఆదివాసీ సంఘం నాయకులు సోయం గంగారాం, సోయం పార్వతి రావు, కడం వెంకటేష్, కుర్సింగ చిన్ను, పి మారుతి, జంగు, ఆత్రం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొలాల అమావాస్య





**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పట్నాపూర్, అందుగూడా మామడతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం పొలాల అమావాస్య పండగను ఘనంగా నిర్వహించారు. ఎద్దులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజల నిమిత్తం ఊరేగింపుగా తీసుకొచ్చారు. దీంతో అన్నదాతలు అత్యంత ప్రీతి పత్రంగా జరుపుకునే పండుగ పొలాల అమావాస్య సందడి కనిపించింది. పండుగకు సంబందించి అవసరమైన వస్తువులను ఖరీదు చేసుకునేందుకు ఆసక్తి చూపడంతో గ్రామాల్లోని ప్రధాన దుకాణాలు కిటకిటలాడాయి. బసవన్నలను అందంగా అలంకరించడానికి అవసరమైన వస్తువులు సామాగ్రిని ఖరీదు చేశారు. వ్యవసాయంలో బసవన్నలు తమకు ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తాయని, బసవన్నలకు ఆ శివుని ఆశీస్సులు నిండు నూరేళ్ళ ఉండాలని, ఎలాంటి కష్టాలు రావద్దని ఎద్దులకు తెల్లవారుజామున పూజలు నిర్వహించారు.

## గుడిహత్నూర్ మండల కేంద్రంలో

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కేంద్రంలో పొలాల అమావాస్య పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఏడాది పాటు శ్రమించే ఎడ్లకు పూర్తి విశ్రాంతి ఇచ్చి వాటిని శుభ్రపర్చి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించినట్లు రైతు శివకుమార్ తెలిపారు.

## మావల మండల కేంద్రంలో

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పొలాల అమావాస్య పండుగను పురస్కరించుకొని శుక్రవారం మావల మండల కేంద్రంలో పొలాల పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ కిసాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సమేతంగా ఎడ్లకు పూజలు నిర్వహించి ఊరేగింపులో పాల్గొన్నారు. నిత్యం రైతుకి సహాయపడే పశువులను పూజించే గొప్ప పండగా అని అన్నారు. ఆయన స్వగ్రామం మావలలోని ఆయన నివాసంలో ఉదయం మట్టితో చేసిన ఎడ్లకు పూజలు చేసిన అనంతరం సాయంత్రం గ్రామంలోని ఎడ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్, పోచమ్మ ఆలయాల్లో డప్పు చప్పుళ్ల నడుమ ఎడ్ల ఊరేగింపు వేడుకగా జరిపారు. రైతులు, యువకులు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.





